EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4 PM
www.suryaa.com
ఆదివారం
24-08-2025
పేజీలు: 02






## నైను కూడా అంతరిక్ష శాస్త్రవేత్త కావాలని ఆశపడ్డానన్న దియా కుమారి

ఒకప్పుడు నైను అంతరిక్ష శాస్త్రవేత్త కావాలని బలంగా ఆకాంక్షించానని, అయితే విధి తనను రాజకీయ రంగం వైపు మళ్లించిందని రాజస్థాన్ ఉపముఖ్యమంత్రి దియా కుమారి అన్నారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా జైపూర్‌లోని చారిత్రక జంతర్ మంతర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె ఈ విషయాన్ని వెల్లడించారు.రాజస్థాన్ పర్యాటక శాఖ, స్పేస్ ఇండియా సంస్థలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన జంతర్ మంతర్‌లో దాదాపు 300 ఏళ్ల తర్వాత అక్కడి ప్రాచీన పరికరాలను ఉపయోగించి ప్రత్యక్షంగా ఖగోళాన్ని పరిశీలించడం ఈ కార్యక్రమం ప్రత్యేకత. ముఖ్య అతిథిగా హాజరైన దియా కుమారి మాట్లాడుతూ, "ఇది ఎంతో గర్వించదగ్గ క్షణం. మహారాజా సవాయ్ జైసింగ్ నిర్మించిన ఈ పరికరాల నుంచి చంద్రయాన్, గగన్‌యాన్ వరకు మన ప్రయాణం గొప్పది. ఇది మన ప్రాచీన ఖగోళ వారసత్వానికి, ఆధునిక శాస్త్ర విజ్ఞానానికి మధ్య ఉన్న సంబంధాన్ని తెలియజేస్తోంది" అని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్ఫూర్తితో సైన్స్, సంస్కృతి, చరిత్రలను మేళవించి ఈ వేడుకను నిర్వహించామని ఆమె తెలిపారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఇస్రో ఎగ్జిబిషన్‌ను ఆమె సందర్శించారు. వాటర్ రాకెట్రీ ప్రదర్శనలను, టెలిస్కోపుల ద్వారా అంతరిక్ష పరిశీలనను ఆసక్తిగా తిలకించారు. రాజస్థాన్‌ను ఆస్ట్రో టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నంలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగు అని ఆమె అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో రాజస్థాన్‌కు చెందిన ఇస్రో శాస్త్రవేత్తలు విద్యార్థులతో తమ అనుభవాలను పంచుకుని స్ఫూర్తినింపారు. స్పేస్ ఇండియా వ్యవస్థాపకుడు సచిన్ బంబా మాట్లాడుతూ, జంతర్ మంతర్ పరికరాలను ప్రత్యక్ష పరిశీలనకు ఉపయోగించడం ఇదే మొదటిసారని స్పష్టం చేశారు. కోటలు, ప్యాలెస్‌లకే కాకుండా, రాజస్థాన్ ఇప్పుడు విజ్ఞానం, శాస్త్రీయ దార్శనికతకు కూడా నిలయంగా నిలుస్తోందని దియా కుమారి పేర్కొన్నారు.




## క్రికెట్‌కు వీడ్కోలుకు పలికిన ఛతేశ్వర్ పుజారా!

భారత క్రికెట్‌కు 'నయా వాల్'గా పేరు గాంచిన సీనియర్ టెస్ట్ ప్లేయర్ ఛతేశ్వర్ పుజారా అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్మెంట్‌ను ప్రకటించాడు. ఈ విషయాన్ని ఆయన సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. 2023లో ఆస్ట్రేలియా పర్యటనలో జట్టు నుంచి చోటు కోల్పోయిన తర్వాత పుజారా గత కొన్నాళ్లుగా ఫామ్ లేక ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిందే. దీంతో అతను తిరిగి జట్టులోకి రావడం కష్టంగా మారింది. దేశవాళీ క్రికెట్‌లో మంచి ప్రదర్శనలు చేసినప్పటికీ, సెలెక్టర్ల నుంచి పిలుపు రాలేదు. దీంతో ఇకపై తనకు జట్టులో చోటు దక్కడం కష్టమని భావించిన అతడు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇక పుజారా నిర్ణయాన్ని పలువురు క్రికెటర్‌లు స్వాగతిస్తున్నారు. కెరీర్ పరంగా చూసుకుంటే.. పుజారా 103 టెస్ట్ మ్యాచ్‌లు ఆడగా.. 43.60 సగటుతో మొత్తం 7,195 పరుగులు చేశారు. ఇందులో 19 సెంచరీలు మరియు 35 అర్ధ సెంచరీలు ఉన్నాయి. 2018-19లో ఆస్ట్రేలియా గడ్డపై జరిగిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో పుజారా అద్భుతమైన ప్రదర్శన కనబరిచి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు గెలుచుకున్నారు. ఆ సిరీస్‌లో మొత్తం 521 పరుగులు చేసి, భారతదేశం తొలిసారిగా ఆస్ట్రేలియాలో టెస్ట్ సిరీస్‌ను గెలుచుకోవడంలో కీలక పాత్ర పోషించారు. అయితే టెస్టులలో రాణించిన పుజారా వన్డేలలో రాణించలేక పోయాడు. తన క్రికెట్ కెరీర్‌లో కేవలం 5 వన్డేలు మాత్రమే ఆడారు. క్రీజులో ఎక్కువ సేపు నిలబడి ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపించే పుజారాని చూసి రాహుల్ ద్రవిడ్ తర్వాత, పుజారాను 'నయా వాల్' అని పిలిచేవారు.



## స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లపై మంత్రుల కమిటీ

వెనుకబడిన వర్గాలకు ఇచ్చిన మాట నిలబెట్టుకునే విషయంలో వెనక్కి తగ్గేది లేదని, సాధించేందుకు సుప్రీం కోర్టులో న్యాయ పోరాటం చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. దీనికి ఇద్దరు సీనియర్ న్యాయవాదులను నియమించాలని నిర్ణయించింది. ఇంకా స్థానిక సంస్థల పై ఏ విధంగా ముందుకు వెళ్ళాలన్న అంశంపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించేందుకు ఉ ప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మం త్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, సీతక్కతో కమిటీని నియమించిం ది. ఈ కమిటీ ఈ నెల 26వ తేదీలోగా నివేదిక సమర్పించాలని, దానిపై 29న జరిగే మంత్రివ ర్గ సమావేశంలో చర్చించి తుది నిర్ణయం తీసుకోవాలని భావించారు. శనివారం గాంధీ భవన్ లో ఏఐసిసి ప్రధాన కార్యదర్శి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ అధ్యక్షత న జరిగిన సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, పిసి సి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసిసి కార్యదర్శి విశ్వనాథ్, ఇంకా పిఏసి సభ్యులు ష బ్బీర్ అలీ, వి. హనుమంత రావు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తదితరులు హాజరయ్యా రు. మూడున్నర గంటల పాటు జరిగిన సమావేశంలో బిసి రిజర్వేషన్లు, జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి జరగనున్న ఉప ఎన్నిక, పార్టీ సంస్థాగత నిర్మాణం, పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీ తదితర అంశాలపై చర్చించారు. బిసి రిజర్వేషన్లను అనుకున్న విధంగా సాధించలేకపోతే పార్టీ తరఫున 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇదిలాఉండగా ఓట్ చోర్, గద్దీ చోడ్ పేరిట రూ పొందించిన పోస్టర్‌ను సిఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా కాంగ్రెస్ నేతృత్వంలో ని 'ఇండి' కూటమి అభ్యర్థిగా ప్రకటించినందుకు ఏఐసిసి అధ్యక్షుడుమల్లికార్జున ఖర్గేకు, ఏఐసిసి అగ్ర నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీకి ధన్యవాదాలు తెలిపారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి రాజ్యాంగ పరిరక్షణ కోసం, పౌర హక్కులను కాపాడేందుకు పని చేశారని ఆయన చెప్పారు. రాహుల్ గాంధీ ఆదేశానుసారం రాష్ట్రంలో కుల గణన చేపట్టామని ఆయన వివరించారు. బిసిలకు విద్యా ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ విడిగా మరో బిల్లు తీసుకుని వచ్చామని ఆయన తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతం మించకుండా బిఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు చట్టం తెచ్చారని ఆయన విమర్శించారు. ఈ అడ్డంకిని తొలగించడానికి మంత్రివర్గం ముసాయిదా ఆర్డినెన్స్‌ను ఆమోదించిందని అన్నారు. కెసిఆర్ తెచ్చిన చట్టాన్ని సవరించడానికి ఆర్డినెన్స్ తెచ్చామని, దానిని గవర్నర్ కేంద్రానికి పంపించారని ఆయన వివరించారు.



## 'జటాధర'లో సితారగా..

నవ దళపతి సుధీర్ బాబు, బాలీవుడ్ పవర్‌హౌస్ సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రలలో నటిస్తున్న సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ జటాధర. అద్భుతమైన సినిమాటిక్ అనుభూతిని అందించే ఈ పాన్-ఇండియా ద్విభాషా చిత్రానికి వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించారు. అద్భుతమైన విజువల్స్, పౌరాణిక ఇతివృత్తాలతో ఈ చిత్రం రూపొందుతోంది. ఇటీవల రిలీజ్ అయిన టీజర్‌కు అనూహ్య స్పందన వచ్చింది. శనివారం మేకర్స్ సితారగా దివ్య ఖోస్లా ను పరిచయం చేశారు. బ్యూటీఫుల్ అండ్ క్లాసిక్ గా కనిపించిన దివ్య ఖోస్లా ఫస్ట్ లుక్ అదిరిపోయింది. ఈ సినిమాను ఉమేష్ కుమార్ బన్సాల్, ప్రేర్ణా అరోరా నిర్మిస్తున్నారు. దేశవ్యాప్తంగా థియేట్రికల్ రిలీజ్ ప్లాన్ చేస్తున్న 'జటాధర' ఇండియా సినిమాలో నెక్స్ మైథాలజికల్ ఎపిక్‌గా మారబోతోంది.



## మూసీ ప్రక్షాళనకు రూ.375కోట్లు

మూసీ ప్రక్షాళనకు ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. మూసీరివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు గాను 2024, 25 ఆర్థిక సంవత్సరానికి గాను బడ్జెట్‌లో కేటాయించిన విధంగా సుమారుగా రూ.375 కోట్ల నిధులను మంజూరు చేస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మూసీ నది ప్రక్షాళనలో భాగంగా నదిలో పేరుకుపోయిన చెత్తను తొలగించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. తాజాగా ఆర్థికశాఖ విడుదల చేసిన నిధులతో మూసీ ప్రక్షాళన మరింత వేగంగా జరుగుతుందని అధికారులు తెలిపారు. మూసీ సుందరీకరణను రూ.4100 కోట్ల రుణం ఇచ్చేందుకు ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టులో భాగంగా నదికి ఇరువైపులా రోడ్లు, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. దీంతోపాటు మూసీనదిలో వరదనీరుతో పాటు డ్రైనేజీ నీటిని వేరు చేసేందుకు ఇంటర్ సెప్టర్ చానల్ నెట్‌వర్క్‌కు రూపకల్పన చేస్తున్నారు.




## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై కాంగ్రెస్ కసరత్తు

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అనుసరించనున్న వ్యూహంపై రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్, ఏఐసిసి కార్యదర్శి విశ్వనాథన్‌పెరుమాళ్ ప్రజాభవన్‌లో రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామిలతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ముందుకెళ్లే వ్యూంపై మంత్రులకు ఏఐసిసి కార్యదర్శి దిశనిర్దేశం చేశారు. ఉప ఎన్నికను గెలిచేందుకు ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు.




## అందుకే సినిమాలను తగ్గించా..

స్టార్ హీరోయిన్ సమంత ఇటీవలే నిర్మాతగా మారింది. రీసెంట్ గానే శుభం అనే సినిమాతో మంచి విజయాన్ని అందుకుంది. తెలుగు ఇండస్ట్రీలో ఒకానొక సమయంలో ఏలింది సమంత.. ఏ స్టార్ హీరో సినిమా చూసినా హీరోయిన్ గా సమంతానే ఉండేది. అయితే గతకొంతకాలంగా సమంత సినిమాలు చేయడం లేదు. మొన్నటివరకు మాయోసైటిస్ తో బాధపడిన సమంత ఇప్పుడిప్పుడే కోలుకుంటుంది. అలాగే ఏడాదిపాటు సమంత సినిమాలకు బ్రేక్ తీసుకున్న విషయం తెలిసిందే.. ఇప్పుడు తిరిగి సినిమాలతో బిజీగా మారిపోయింది. ఇదిలా ఉంటే ఈ మధ్య సమంత మరోసారి రిలేషన్ లో ఉంది అంటూ రకరకాల వార్తలు వస్తున్నాయి. దర్శకుడు రాజ్ నిడిమోరుతో సమంత డేటింగ్ చేస్తుందని కొద్దిరోజులుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఫ్యామిలీ మ్యాన్ సిరీస్ తో రాజ్ నిడిమోరు పాపులర్ అయ్యారు. ఈ మధ్యకాలంలో సమంత, రాజ్ నిడిమోరు కలిసున్న ఫోటోలు సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నాయి.

సూర్య EVENING EDITION 4PM www.suryaa.com

# ప్రేమించి పెళ్లాడిన భార్యను చంపి.. ముక్కలు చేసిన భర్త

మేడ్చల్ జిల్లా మేడిపల్లి పరిధి బాలాజీహిల్స్‌లో ఓ క్రూర ఘటన చోటుచేసుకుంది. ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను అత్యంత కిరాతకంగా హత్య చేశాడు భర్త. గర్భవతైన భార్యను చంపిన అనంతరం శరీరాన్ని ముక్కలుముక్కలుగా చేశాడు. తలతో పాటు కొన్ని శరీరభాగాలను కవర్‌లో పెట్టి పడేయడానికి సిద్ధమయ్యాడు. గదిలో శబ్దాలు విని పొరుగువారు వెళ్లి చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే కామారెడ్డిగూడకు చెందిన జ్యోతి, మహేందర్‌రెడ్డి ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరిద్దరూ నెల క్రితం బోడుప్పల్‌కు వచ్చి శ్రీనివాసనగర్‌లో నివసిస్తున్నారు. మహేందర్‌రెడ్డి క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గర్భవతిగా ఉన్న భార్య జ్యోతిని గృహకలహాల నేపథ్యంలో హత్య చేశాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు వెంటనే వెళ్లి నిందితుడు మహేందర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. మృతురాలి బావ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బయట ఏమైనా శరీర భాగాల పడేశాడా అని పోలీసులు గాలిస్తున్నారు. ఈ ఘటనతో మృతురాలు జ్యోతి తల్లి కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. నిందితుడి తల్లిదండ్రులు, బంధువులు చెప్పిమరి తన బిడ్డను చంపేశారని ఆరోపిస్తోంది. వారిని కఠినంగా శిక్షించాలంటూ డిమాండ్ చేస్తోంది. నిందితుడు మహేందర్‌రెడ్డి ప్రవర్తన వింతగా ఉండేదని చెప్తున్నారు స్థానికులు.





## సంపద సృష్టిస్తామన్నారు.. అప్పులు చేశారు

‘2019-24 మధ్య కాలంలో వైసీపీ ప్రభుత్వంపై టీడీపీ, జనసేన నేతలు పదేపదే అబద్ధాలు చెప్పారు. రాష్ట్రంలో ఆదాయ వృద్ధి తగ్గిందని, అభివృద్ధి లేదనీ తప్పుడు ప్రచారం చేశారు. కూటమి అధికారంలోనికి వస్తే సంపద సృష్టిస్తామని నమ్మబలికారు. కానీ, రాష్ట్రంలో ఆదాయం తగ్గిపోయి అప్పులు పెరిగినట్లుగా కంపోట్రలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదికలు వెల్లడించడం ఆందోళన కలిగిస్తోంది’ అని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శనివారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. 2024-25లో కేంద్ర ప్రభుత్వ ఆదాయాభివృద్ధి 12.04 శాతం భారీగా పెరిగితే.. రాష్ట్ర ఆదాయ వృద్ధి 3.08 శాతం వద్దే ఎందుకు ఆగిపోయింది? ప్రజల కొనుగోలు శక్తి కూడా బాగా తగ్గిపోయింది. కూటమి అధికారంలోనికి వచ్చినప్పటి నుంచి ఆదాయం వృద్ధి 2.39 శాతం మాత్రమే ఉంది. మా ప్రభుత్వ హయాంలో అన్ని రకాల అప్పులు కలిపి రూ.3,32,671 కోట్లు మాత్రమే. కూటమి ప్రభుత్వంఈ 14నెలల్లోనే రూ.1,86,361 కోట్లు అప్ప చేసింది’ అని పేర్కొన్నారు.

# త్వరలోనే 6G




శనివారం ది ఎకనామిక్ టైమ్స్ వరల్డ్ లీడర్స్ ఫోరంలో ప్రసంగిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒక కీలక ప్రకటన చేశారు. ఇండియా 2025 చివరి నాటికి దేశీయంగా తయారు చేసిన మొదటి సెమీకండక్టర్ చిప్‌ను విడుదల చేయనుందని, మేడ్ ఇన్ ఇండియాలో భాగంగా 6G నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయడంలో దేశం వేగంగా ముందుకు వెళ్తోందని ఆయన వెల్లడించారు. గత ఐదు నుండి ఆరు దశాబ్దాలుగా భారతదేశం సెమీకండక్టర్ రంగంలో అవకాశాలను కోల్పోయిందని మోడీ అన్నారు. “భారతదేశంలో సెమీకండక్టర్ తయారీ 50-60 సంవత్సరాల క్రితమే ప్రారంభమై ఉండేదని మనందరికీ తెలుసు, కానీ భారతదేశం దానిని కోల్పోయింది. నేడు మనం ఈ పరిస్థితిని మార్చాం. భారతదేశంలో సెమీకండక్టర్ సంబంధిత కర్మాగారాలు రావడం ప్రారంభించాయి. ఈ సంవత్సరం చివరి నాటికి మొదటి మేడ్-ఇన్-ఇండియా చిప్ మార్కెట్లోకి వస్తుంది” అని ప్రధాని పేర్కొన్నారు. దేశ సాంకేతిక రంగ వేగాన్ని ప్రస్తావిస్తూ.. మేడ్ ఇన్ ఇండియా 6Gపై మేం వేగంగా పని చేస్తున్నాం అని ప్రధాని వెల్లడించారు.

100 దేశాలకు ఎలక్ట్రిక్ వాహనాలు

ఇండియా 100 దేశాలకు ఎలక్ట్రిక్ వాహనాలను (EVలు) ఎగుమతి చేయాలనే ప్రణాళికలను ఈ సందర్భంగా ప్రధాని మోదీ ప్రకటించారు. “భారతదేశం ఇప్పుడు ప్రపంచంలోని 100 దేశాలకు ఎలక్ట్రిక్ వాహనాలను ఎగుమతి చేయబోతోంది. దీనికి సంబంధించిన చాలా పెద్ద కార్యక్రమం కూడా ఆగస్టు 26న ప్రారంభం కానుంది.” అని ఆయన పేర్కొన్నారు. “సంస్కరణ, పనితీరు, పరివర్తన అనే మంత్రాన్ని అనుసరించే భారతదేశం నేడు ప్రపంచాన్ని నెమ్మదిగా వృద్ధి రేటు నుండి బయటపడేయగల స్థితిలో ఉంది” అని మోదీ అన్నారు. భారతదేశం త్వరలో ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని, ప్రపంచ వృద్ధికి 20 శాతం దోహదపడుతుందని ఆయన అంచనా వేశారు. షిప్పింగ్, పోర్టులు, క్రీడలకు సంబంధించిన పురాతన చట్టాలను — విస్తృత సంస్కరణలు భర్తీ చేశాయని, పోర్టు ఆధారిత అభివృద్ధిని పెంచడానికి, నీలి ఆర్థిక వ్యవస్థను విస్తరించడానికి, కొత్త జాతీయ క్రీడా విధానం ద్వారా బలమైన క్రీడా పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి రూపొందించిన ఆధునిక చట్రాలతో దీనిని రూపొందించామని ఆయన అన్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాల సందర్భంగా ఇటీవల జరిగిన శాసనసభ అంతరాయాలను ప్రధాని మోదీ ప్రస్తావించారు. ప్రభుత్వం సంస్కరణలకు కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. “ప్రతిపక్షాలు సృష్టించిన అనేక అంతరాయాలు ఉన్నప్పటికీ, ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో సంస్కరణలలో నిమగ్నమై ఉంది” అని ఆయన అన్నారు.

# అమెరికాకు పోస్టల్ సర్వీస్‌లు నిలిపివేత

కొన్ని మినహాయింపులతో అ మెరికాకు అన్ని రకాల పోస్టల్ సేవలను భారత్ నిలిపివేసింది. 25వ తేదీ నుంచి అంటే రేపటి నుంచే ఇది అమల్లోకి వ స్తుందని పోస్టల్ విభాగం ప్రకటించింది. అయితే సేవల నిలిపివేత తాత్కాలిక మేన ని శనివారంనాడు విడుదల చేసిన ఓక ప్ర కటనలో తెలిపింది. భారత్‌పై పలు రకాల సుంకాల విధింపు ఆదేశాలను అమెరికా ఈ నెల 27 నుంచి అమలులోకి తీసుకువస్తుండడం, అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ వద్ద కచ్చితమైన మార్గదర్శకాలు లేకపోవడం తాజా నిర్ణయానికి కారణమైంది. 800 డాలర్ల వరకూ విలువ చేసే సరుకులపై ఇప్పుడు ఉన్న డ్యూటీ ఫ్రీ మినిమ్స రద్దు చేస్తూ జులై 30న అమెరికా ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. 100 డాలర్ల వరకూ విలువచేసే లెటర్స్, డాక్యుమెంట్లు, కానుకలు సుంకాల నుంచి మినహాయింపు కొనసాగుతుందని ప్రకటించింది. ఇక అంతకుమించి విలువ గలిగిన ఏ వస్తువులు కూడా ఇక అమెరికాకు పోస్టు ద్వారా టారిఫ్‌ల భారం లేకుండా వెళ్లేందుకు వీలుండదు. ఇలాంటి పరిస్థితుల్లో ఆగస్టు 25 తర్వాత వచ్చే పోస్టల్ కన్‌సైన్‌మెంట్లను




స్వీకరించలేమని అమెరికా విమానాయాన సంస్థలు కూడా వెల్లడించాయి. ఇప్పటికే బుకింగ్ జరిగిన వాటికి రీఫండ్ ఉంటుందని, తిరిగి సేవల పునరుద్ధరణకు కృషి చేస్తున్నట్లు విమానయాన సంస్థలు ప్రకటించాయి.ఆగస్టు 27 నుంచి టారిఫ్‌లు అమల్లోకి రానున్న నేపథ్యంలో ఈ సమయంలో గడువు పొడిగింపు లాంటింది ఉంటుందని అనుకోవడం లేదని శ్వేతసౌధం వాణిజ్య సలహాదారు పీటర్ నరావో అభిప్రాయపడ్డారు.



## హాట్ బ్యూటీ దిశా పటాని

తెలుగులో ఎంతో మంది ముద్దుగుమ్మలు తమ అందచందాలతో, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కానీ ఆతర్వాత టాలీవుడ్ కు దూరం అయ్యారు. తెలుగులో కొన్ని సినిమాలే చేసి ఆ తర్వాత బాలీవుడ్ కు చెక్కేసినవారు చాలా మంది ఉన్నారు. కొంతమంది ముద్దుగుమ్మలు ఒకటి రెండు సినిమాలతోనే పరిమితం అవుతున్నారు. పెళ్లి చేసుకొనో.. లేక అవకాశాలు లేక సినిమాలకు దూరం అయ్యారు. ఒక ముద్దుగుమ్మ తెలుగులో రెండే సినిమాలు చేసింది. అందులో ఒకటి డిజాస్టర్ కాగా ఓ సినిమా సంచలన విజయం సాధించింది. కానీ ఈ బ్యూటీకి ఆఫర్స్ మాత్రం లేదు. ఇప్పుడు ఒకొక్క సినిమాకు రూ. 3 కోట్లు వసూల్ చేస్తుంది ఈ చిన్నది. అలాగే ఆమె ఆస్తి పాస్తులు కూడా కోట్లల్లో ఉన్నాయి. అంతే కాదు ఇండస్ట్రీలో ఆమెను మించిన హాట్ బ్యూటీ లేదు. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా..?ఇండస్ట్రీలో హాట్ బ్యూటీగా పేరు తెచ్చుకుంది ఆమె.. అందంలో అప్సరస.. కానీ తెలుగులో చేసిన సినిమాలు మాత్రం రెండు సినిమాలే ఒకటి డిజాస్టర్, మరో సినిమా భారీ హిట్. ఆమె ఎవరో కాదు దిశా పటాని.



ఢిల్లీలో ఆలిండియా స్పీకర్స్ కాన్ఫరెన్స్ సదస్సును


## ప్రారంభించనున్న మంత్రి అమిత్ షా

దేశ రాజధాని ఢిల్లీలో ఈ రోజు, రేపు ఆలిండియా స్పీకర్ల కాన్ఫరెన్స్ జరగనుంది. ఇవాళ అక్కడి అసెంబ్లీ భవనంలో సదస్సును కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రారంభించనున్నారు. ముగింపు కార్యక్రమానికి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా హాజరుకానున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల శాసనసభల స్పీకర్లు శనివారం రాత్రే ఢిల్లీకి చేరుకున్నారు. ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు వెళ్లారు. ఇటు తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తో పాటు మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు వెళ్లగా.. తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి కంటి శస్త్ర చికిత్స జరిగినందున ఈ సమావేశాలకు హాజరు కావడం లేదు. 1925లో భారతదేశ సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ స్పీకర్‌గా ఎన్నికైన మొదటి భారతీయుడు విఠల్‌బాయి పటేల్ బాధ్యతలు స్వీకరించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. కాగా, ఈ రెండు రోజుల సదస్సులో దేశవ్యాప్తంగా అసెంబ్లీల స్పీకర్లు, పలువురు డిప్యూటీ స్పీకర్లు, మండలి చైర్మన్లు, డిప్యూటీ చైర్మన్లు పాల్గొంటారు.

# అందరి కళ్లు ఆ ఇద్దరిపైనే!

ప్రతిష్ఠాత్మకమైన యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌కు ఆదివారం తెరలేవనుంది. సీజన్‌లో చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ అయిన యూఎస్ టైటిల్‌పై స్టార్ ఆటగాళ్లు కన్నేశారు. డిఫెండింగ్ ఛాంపియన్ జన్నిక్ సినర్ (ఇటలీ), స్పెయిన్ సంచలనం కార్లోస్ అల్కరాజ్ పురుషుల సింగిల్స్ విభాగంలో ఫేవరెట్‌లుగా బరిలోకి దిగనున్నారు. మహిళల విభాగంలో డిఫెండింగ్ ఛాంపియన్ అరినా సబలెంక (బెలారస్), మాజీ విజేత ఇగా స్వియాటెక్(పోలండ్) లు టైటిల్ ఫేవరెట్‌లుగా కనిపిస్తున్నారు. ఇక యూఎస్ ఓపెన్‌లో ఇప్పటికే మిక్స్‌డ్ డబుల్స్ విభాగం పోటీలు ముగిసాయి. అంతేగాక మహిళలు, పురుషుల విభాగంలో క్వాలిఫయర్ పోటీలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ఇక మెయిన్ డ్రా పోటీలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. ఈ టోర్నీలో పురుషుల సింగిల్స్ విభాగంలో సినర్‌కు, మహిళల సింగిల్స్‌లో అరినా సబలెంకకు టాప్ సీడింగ్ లభించాయి. పురుషుల సింగిల్స్‌లో అల్కరాజ్‌కు రెండో, అలెగ్జాండర్ జ్వరేవ్ (జర్మనీ)కి మూడో, టెలర్ ఫ్రిట్జ్ (అమెరికా)కు నాలుగో, జాక్





డ్రాపర్‌కు ఐదో సీడ్ దక్కింది. బెన్ షెల్టన్, నొవాక్ జకోవిచ్ (సెర్బియా), అలెక్స్ డి మినార్ (ఆస్ట్రేలియా), కరెన్ కచనోవ్ (రష్యా), లొరెంజొ ముసెట్టి (ఇటలీ) టాప్10 సీడింగ్‌లను దక్కించుకున్నారు. మహిళల విభాగంలో ఇగా స్వియాటెక్‌కు రెండో, కొకొ గాఫ్ (అమెరికా)కు మూడో, జెసికా పెగులాకు నాలుగో, మిరా అండ్రీవాకు ఐదో సీడ్ లభించింది. మాడిసన్ కీస్, జస్మయిన్ పాలిని, ఎలినా రిబకినా, ఎమ్మా నవ్వారొలు టాప్10 సీడింగ్‌లను సొంతం చేసుకున్నారు. కాగా, పురుషుల విభాగంలో టైటిల్ కోసం సినర్, అల్కరాజ్‌ల మధ్య గట్టి పోటీ నెలకొంది. ఇద్దరు కూడా పురుషుల టెన్నిస్‌లో ఎదురులేని శక్తులుగా మారారు. కొంతకాలంగా వీరిద్దరే గ్రాండ్‌స్లామ్ టైటిల్స్‌ను దక్కించుకుంటున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు జరిగిన మూడు గ్రాండ్‌స్లామ్ ట్రోఫీల్లోనూ వీరిద్దరే ఫైనల్‌కు చేరారు. సినర్ ఈ సీజన్‌లో ఆస్ట్రేలియా ఓపెన్, వింబుల్డన్ ఓపెన్‌లను గెలుచుకున్నాడు. ఫ్రెంచ్ ఓపెన్‌లోనూ ఫైనల్‌కు చేరుకున్నాడు. కిందటి సీజన్‌లో సినర్ యూఎస్ ఓపెన్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఈసారి కూడా టైటిల్ గెలవాలనే పట్టుదలతో ఉన్నాడు.